విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం..

మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మంత్రి మల్లారెడ్డి

మేడిపల్లిలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

అల్పాహారం చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ గొప్ప సంకల్పంతో 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకాన్ని ప్రారంభించారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్పాహార పథకాన్ని శుక్రవారం మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను పొందడమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమన్నారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గాదయాకర్ రెడ్డి, పీర్జాదిగూడ వైస్ చైర్మన్ శివగౌడ్, స్థానిక కార్పొరేటర్ హరి శంకర్‌రెడ్డి, డీఈవో విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాలో...

మేడ్చల్ నియోజకవర్గంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంత్రి మల్లారెడ్డి, ఉప్పల్ నియోజవర్గంలోని ఎంపీహెచ్‌ఎస్ చిలుకనగర్‌లో ఎమ్మెల్యే బేతి సుభాశ్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జడ్పీహెచ్‌ఎస్ బహదూర్‌పల్లిలో ఎమ్మెల్యే వివేకానంద్, కూకట్‌పల్లి నియోజకవర్గం జడ్పీహెచ్‌ఎస్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మల్కాజిగిరి నియోజకవర్గం అల్వాల్ బాలికల పాఠశాలలో అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.



అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు బ్రేక్‌ఫాస్ట్ తినిపిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

టిఫిన్ వడ్డించి.. విద్యార్థులకు తినిపించి..

బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్

అడ్డగుట్ట, అక్టోబర్ 6:పేద విద్యార్థులకు బాసటగా నిలిచి, వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు టిఫిన్ వడ్డించి, కొంత మంది విద్యార్థులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుదాంశు, ఇంజినీర్ ఆశాలత, ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు లింగాని శ్రీనివాస్, విద్యాశాఖ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టిఫిన్స్ వడ్డిస్తున్న దృశ్యం

అల్పాహారం తింటూ.. విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి కేటీఆర్

దేశంలోనే మొదటిసారిగా..

1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సీఎం బ్రేక్ ఫాస్ట్

పౌష్టికాహార లోపం నిర్మూలించేందుకే అల్పాహారం పథకం

అమ్మలా.. కమ్మగా

ముఖ్యమంత్రి అల్పాహార పథకం

- జీహెచ్‌ఎంసీ పరిధిలో 2లక్షల పై చిలుకు విద్యార్థులకు ప్రయోజనం
- వెస్ట్‌మారేడ్‌పల్లి ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రారంభించిన ఐటీ మంత్రి కేటీఆర్

పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని ఉదయం పూట విద్యార్థులకు అందించడం వల్ల వారు తరగతి గదుల్లో మరింత చురుగ్గా వ్యవహరించే వీలుందన్న సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిన ముఖ్యమంత్రి అల్పాహార పథకం' అట్టహాసంగా ప్రారంభమైంది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటలకు విద్యార్థులకు ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ద్వారా టిఫిన్ పెడుతారు. హైదరాబాద్ జిల్లాలోని మొత్తం 15 నియోజకవర్గాల్లో 868 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,46,086 మంది 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరనున్నది. శుక్రవారం ఉదయం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో మంత్రి కేటీఆర్, అమీర్‌పేట ధరమ్‌కరమ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, మహమూద్ అలీ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రి మల్లారెడ్డి, సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్, మిగిలిన అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎమ్మెల్యేలు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి విద్యార్థులకు టిఫిన్ వడ్డించారు.

సమన సీఎం 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. బంగారు తెలంగాణలో భావితరాలు పౌష్టికంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వివిధ పనులు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రులు, రోజువారి కష్టపడే కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు.

అందరూ తినండి.. ఎలా ఉన్నదో చెప్పండి

తాను విద్యార్థులతో అల్పాహారం చేస్తున్న సందర్భంలో ఒక విద్యార్థిని మీ తల్లిదండ్రులు ఏం చేస్తారని అడుగగా ట్రైలరింగ్ చేస్తున్నారని చెప్పిందని, ఇటువంటి చిన్నారులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని వెల్లడించారు. అల్పాహారంపై ఫీడ్ బ్యాక్ తెలియజేయాలని టీచర్లను, విద్యార్థులను కోరారు. ఈ ప్రాంత ప్రజలు కూడా పరిశీలించి ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని చెప్పారు. నాణ్యతపై ఎప్పటికప్పుడు దృష్టిపెట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సూచించారు. ఉప్పల్‌లోని మన్న ట్రస్ట్ నిర్వాహకురాలు లీల జోసెఫ్ ఆధ్వర్యంలో రోజుకు 2లక్షల భోజనాలు సరఫరా చేస్తున్న నేపథ్యంలో ఆమెను అభినందించారు.

అల్పాహారంలో ఇవీ..!

శుక్రవారం అల్పాహారం ప్రారంభంలో భాగంగా.. ఇడ్లీ, సాంబార్, పూరి, ఆలుకుర్మా, ఉప్మా, చట్నీ, స్వీట్ కేసరి పదార్థాలను వడ్డించారు. వెస్ట్ మారేడ్‌పల్లి విద్యార్థులు 350 మందితో కలుపుకొని పరిసర ప్రాంత పాఠశాలల విద్యార్థులు సుమారు 800లకు పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్య నందిత, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యాశాఖ అధికారి రోహిణి, జోనల్ కమిషనర్ రవికిరణ్, అడిషనల్ కమిషనర్ స్నేహాశబరీశ్, ఆర్డీవో రవి, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అల్పాహార పథకం లక్ష్యాలు..

- తరగతి గదిలో ఆకలిని నివారించడం
- పౌష్టికాహార లోపాన్ని తగ్గించడం
- విద్యార్థుల ఆరోగ్యం, పెరుగుదలను మెరుగుపర్చడం
- ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రోత్సహించడం
- నమోదును పెంచడం, డ్రాప్‌అవుట్ రేటును తగ్గించడం
- సాంఘికీకరణను మెరుగుపర్చడం

సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ వీక్లీ మెనూ

సోమవారం -	ఇడ్లీ సాంబార్ లేదా గోదుమ రవ్వ లేదా ఉప్మా చట్నీ
మంగళవారం -	పూరి, ఆలు కుర్మా లేదా టమాట బాత్ విత్ సాంబార్
బుధవారం -	ఉప్మా, సాంబార్ లేదా జియ్యం రవ్వ కిచిడి, చట్నీ
గురువారం -	చిరుధాన్యాల ఇడ్లీ, సాంబార్ లేదా పొంగల్ సాంబార్
శుక్రవారం -	ఉగ్గాని/అటుకులు/ చిరుధాన్యాల ఇడ్లీ చట్నీ లేదా జియ్యం రవ్వ కిచిడీ చట్నీ
శనివారం -	పొంగల్, సాంబార్ లేదా కూరగాయల పాలావ్ పెరుగు చట్నీ/ఆలు కుర్మా

ఆకలి తీర్చి.. చదువులు నేర్పి..!

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రి సబితారెడ్డి, ఎంపీలు రంజిత్‌రెడ్డి, బీబీపాటిల్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, రఘోత్తంరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, తదితరులు

- సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు రావిర్యాలలో శ్రీకారం
- ప్రారంభించిన మంత్రులు హరీశ్ రావు, సబితాఇంద్రారెడ్డి
- విద్యార్థులకు ఇడ్లీలు తినిపించిన మంత్రులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల్లోని విద్యార్థుల ఆకలితీర్చే 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం'ను శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని రావిర్యాల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మంత్రులు హరీశ్ రావు, సబితాఇంద్రారెడ్డి ప్రారంభించి చిన్నారులకు ఇడ్లీలు తినిపించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చే పథకమని అన్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని ఇండ్లల్లోని పిల్లలు ఏం తింటారో.. సీఎం బ్రేక్‌ఫాస్ట్‌లో అదే మెనూను చేర్చి, సర్కారు బడుల్లోని చిన్నారులకు అందజేస్తున్నామన్నారు. 1వ -10వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్‌ను సమకూర్చే ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల కడుపునింపే కార్యక్రమం మాత్రమేకాదని, డ్రాప్ అవుట్ రేటును తగ్గించి, బడిబాట పట్టించి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చే పథకమన్నారు. దసరా తర్వాత ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుందని చెప్పారు. అనంతరం మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బ్రేక్‌ఫాస్ట్ అంటే ఉప్మా పెట్టవద్దన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పౌష్టికాహారంతో కూడిన మెనూను రూపొందించామన్నారు. పంచాయతీరాజ్, మహిళాశిశు సంక్షేమశాఖ, మున్సిపల్‌శాఖల సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు గడ్డం రంజిత్‌రెడ్డి, బీబీపాటిల్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, రఘోత్తంరెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్, విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హన్మంతరావు, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్యాపకులు, విద్యార్థులు

ప్రతిరోజూ కలిసి తినాలి



అమీర్‌పేట్ డీకేరోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం తినిపిస్తున్న మంత్రి మహమూద్‌అలీ, చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, తదితరులు

- అల్పాహారంలో నాణ్యతాలోపాలు తలెత్తితే సమాచారం ఇవ్వాలి
- డీకేరోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ

అమీర్‌పేట్, అక్టోబర్ 6 : అమీర్‌పేట్ డీకేరోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. మొదటిరోజు పాఠశాలకు చెందిన 750 మందికి పైగా విద్యార్థులు అల్పాహారాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందించాలన్న సీఎం కేసీఆర్ ఆలోచన కార్యరూపం దాల్చడం శుభసూచకమన్నారు. పాఠశాల అధ్యాపకులు కూడా విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని తీసుకోవాలని, ఎక్కడైనా నాణ్యతా లోపాలు తలెత్తితే వెంటనే స్పందించాలని అధ్యాపకులకు సూచించారు. తమ పిల్లలు ఉన్నతంగా చదవాలన్న తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ తెలంగాణలో అనుసరిస్తున్న విద్యా విధానాలకు దేశవ్యాప్తంగా చక్కటి గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకటేశ్, విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మి, కార్పొరేటర్ కేతినేని సరళ, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో పాటు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అద్భుత పథకం

ముక్కవరం మనోహరాచార్య, ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థులతో పాటు పనులు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ పథకం అద్భుతం. ఈ ప్రాంతంలో అత్యధికంగా పేదలు ఉంటారు. అల్పాహారం అందజేయడం వల్ల పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా డ్రాప్‌అవుట్ కాకుండా దోహదపడుతుంది. ఎంతో దూరదృష్టితో ఈ పథకాన్ని రూపొందించిన ముఖ్యమంత్రికి, ఇక్కడికి విచ్చేసి పథకాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు.

టిఫిన్స్ రుచికరంగా ఉన్నాయి

సాయిగీతిక, 9వ తరగతి, న్యూబోయిన్‌పల్లి

టిఫిన్స్ రుచికరంగా ఉన్నాయి. పూరి, ఆలుకుర్మా, ఉప్మా చట్నీ, స్వీట్ కేసరి తిన్నాను. చాలా బాగున్నయ్. ఇక స్కూల్‌కు డుమ్మా కొట్టాలన్నా.. కొట్టలేం. అంతమంచిగా అల్పాహార పథకంలోనే వంటకాలు ఉన్నాయి. ఇంటి వద్ద ఆగమాగం తిని స్కూల్‌కు ఉరుకొచ్చేది. ఇప్పటి నుంచి స్కూల్‌కు వచ్చిన తర్వాత టిఫిన్ చేసి, బాగా చదువుకుంటాం.

తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పినయ్

సప్పిడి వైశాలి, 10వ తరగతి, ఈస్ట్ మారేడ్‌పల్లి

ప్రత్యేక తరగతులు ఉన్నప్పుడు తిని రాకపోతే కొంత మంది విద్యార్థులు కండ్లు తిరిగి పడిపోయేవారు. ఇప్పుడు ఇక ఆ పరిస్థితి ఏర్పడదు. మా అమ్మ ఓ దవాఖానలో హౌస్‌కీపింగ్ చేస్తుంది. మా నాన్న సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. ఎర్లిమార్నింగే వారు వాళ్లే పనులకు వెళ్లాల్సిందే. ఈ పథకం అమలుతో వారి ఇబ్బందులు తొలిగిపోయాయి.

ఇక స్కూల్‌ల్లోనే టిఫిన్, భోజనం

అమృతవర్షిణి, 10వ తరగతి, ఈస్ట్ మారేడ్‌పల్లి

దూరం నుంచి స్కూల్‌కు వచ్చే విద్యార్థులకు సమయం ఆదా అవుతుంది. తల్లిదండ్రులకు అలసట లేకుండా ఉంటుంది. ఉదయాన్నే మా పేరెంట్స్ పనులకు వెళ్తుంటారు. ఆ సమయంలో త్వరగా వంట చేయాలంటే ఇబ్బందులు ఏర్పడుతాయి. ఇప్పుడు ఆ సమస్యలు తప్పినట్టే. ఇక స్కూల్‌ల్లోనే టిఫిన్, మధ్యాహ్న భోజనం.. ఇంకేముందు చదువుపైనే దృష్టి పెడతాం.